


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 27.06.2026 | సంపుటి: 3 | సంచిక: 145 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 27.06.2026 | VOLUME : 3 | ISSUE : 145 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# అసైన్‌మెంట్ భూములు లాక్కుంటున్నారు

రేవంత్ అరాచకాలను మరిచిపోవద్దు

పేదలకు బీఆర్ఎస్ అండగా నిలబడుతుంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**పరిగి, జూన్ 26 :** అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూములను లాక్కుంటున్నారని, పారిశ్రామికవాడల ఏర్పాటు పేరుతోని దళిత, గిరిజన పేదల భూములను గుంజుకుంటున్నారని కాంగ్రెస్ పాలకులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. పరిగి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పరిగిలోను పారిశ్రామికవాడల పేరుతోని స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రభుత్వం అక్రమంగా భూములు గుంజుకుంటున్నదన్నారు. లగచర్లలో రేవంత్ రెడ్డి అరాచకాలను ఎప్పటికీ

మిగతా 3వ పేజీలో..



# రూ.13,006 కోట్లతో మెగా రోడ్ల ప్రాజెక్టు

- హ్యామ్ విధానంలో 6,092 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి
- తొలి విడతలో 441 రోడ్లకు కొత్త రూపు
- గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం
- వేగవంతమైన, సురక్షిత ప్రయాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం

## జూన్ 28న కనగల్‌లో సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్, జూన్ 26:** తెలంగాణలో రహదారుల వ్యవస్థను ఆధునికీకరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల అభివృద్ధి పనులకు జూన్ 28న నల్గొండ జిల్లా కనగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.13,006 కోట్లను కేటాయించింది. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల మేర ఉన్న 441 రహదారులను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు వాణిజ్యపరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది.

**రూ.13,006 కోట్లతో మెగా రోడ్ల ప్రాజెక్టు**

హ్యామ్ విధానంలో పనులు చేపట్టడం

మిగతా 2వ పేజీలో..

# రైతు ఆశీర్వాద సభతో హీటెక్కిన రాజకీయాలు

- మధిర నియోజకవర్గంలో సభ
- పెద్ద ఎత్తున జనసమీకరణకు సన్నాహాలు
- కాంగ్రెస్‌పై విరుచుకుపడుతున్న విపక్షాలు
- ప్రతిపక్షాలపై కాంగ్రెస్ నేతల ఎదురుదాడి

**ఖమ్మం, జూన్ 25 :** జిల్లాలో మరోసారి రాజకీయాలు వేడెక్కాయి. ఒకవైపు అధికార కాంగ్రెస్ పార్టీ 'రైతు ఆశీర్వాద సభ' ద్వారా రైతుల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో ఉండగా మరోవైపు బీఆర్ఎస్ నేతలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), పార్టీ సభ్యత్వ నమోదు సదస్సుల పేరుతో ఖమ్మం బాట పట్టి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అధికార పార్టీ ప్రభుత్వ హామీలను అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కాగాఅధికార కాంగ్రెస్ పార్టీ ఈ నెల 30న ఖమ్మం నగర సమీపాన మధిర నియోజక వర్గంలోని మత్కేపల్లి క్రాస్ రోడ్డు, జగన్నాథపురం లో భారీ ఎత్తున 'రైతు ఆశీర్వాద సభ'ను నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది ఈ సభకు రైతులను పెద్ద ఎత్తున తరలించేందుకు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు వరుస

మిగతా 2వ పేజీలో..





## డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టండి

- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశం

## డ్రగ్స్ రహిత రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- యువత డ్రగ్స్ కు దూరంగా వుండాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 26:** ఈగల్ ఫోర్స్, సామాజిక న్యాయం సాధికారత శాఖలు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా అంతర్జాతీయ

మిగతా 3వ పేజీలో..






## పెట్టుబడులే కాదు.. ప్రజల జీవనమూ ముఖ్యమే

పవర్ కట్స్ లేవు.. నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం

పారిశ్రామికరంగ ప్రతినిధుల కోసం వారంలో ఒక రోజు కేటాయిస్తా

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



## కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ అధికారి

30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం

2




2

## రాష్ట్రానికి భారీ వర్ష సూచన

అరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

## ఆగస్టు నాటికి కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పనులు పరిశీలించిన మంత్రి

**ఖమ్మం జూన్ 26 :** పామాయిల్ సాగు రాష్ట్ర రైతాంగానికి వరంగా మారిందని, దేశానికే ఆయిల్ ఫామ్ హబ్ గా రాష్ట్రం మారనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండలం కల్లూరుగూడెం వద్ద నిర్మిస్తున్న పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు

మిగతా 2వ పేజీలో..



## హైదరాబాద్‌లో తొలి డేటా సెంటర్ సిటీ

దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది


1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం

త్వరలో వికారాబాద్ జిల్లా చేవెళ్లలో ఏర్పాటు

సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

3






## మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

- 107 కోట్లతో చేపట్టిన 'హైడ్రా'

3



## తెలంగాణలో అధికారమే బీజేపీ లక్ష్యం

- 28నుంచి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాష్ట్ర పర్యటన
- తుంగభద్ర జలాలపై ప్రజలకు సీఎం సమాధానం చెప్పాలి
- రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2

## ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలపై కన్నేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించాల్సిందే

కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి

**హైదరాబాద్, జూన్ 26 :** విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు వసూలు చేసే కాలేజీలు కనీస విద్యా ప్రమాణాలను, వసతులను ఖచ్చితంగా

మిగతా 3వ పేజీలో..



## మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు



- ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి
- సంచలన తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోర్టు

**మద్రాస్, జూన్ 26:** మత మార్పిడులు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇతర వెనుకబడిన వర్గాల

మిగతా 3వ పేజీలో..

# పెట్టుబడులే కాదు.. ప్రజల జీవనమూ ముఖ్యమే

- పవర్ కట్స్ లేవు.. నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం
- పారిశ్రామికరంగ ప్రతినిధుల కోసం వారంలో ఒక రోజు కేటాయిస్తా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 26 :**

ప్రజా ప్రభుత్వానికి పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని.. అది ప్రజల జీవనోపాధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో 2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఎఫ్‌టీసీసీఐ ఒక బలమైన వారధిగా పనిచేస్తోందన్నారు. పారిశ్రామిక ప్రదర్శన యంత్రాలు, ఉత్పత్తుల ప్రదర్శన మాత్రమే కాదని, ఆలోచనలు పంచుకునే ఒక అద్భుత వేదిక అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇక్కడ చిన్న వ్యాపారులకు కొత్త కస్టమర్లు, తయారీదారులకు సరికొత్త సాంకేతికత, స్టార్టప్‌లకు తొలి కొనుగోలుదారులు లభించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పెట్టుబడిదారుల నమ్మకాన్ని చూరగొని పటిష్టంగా వృద్ధి చెందిందని తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. మన వృద్ధి కేవలం సేవల రంగానికే పరిమితం కాకూడదని చెప్పారు. జీడీపీలో పారిశ్రామిక రంగం, ముఖ్యంగా ఎంఎస్ఎంఈల వాటా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి కల్పనలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం కీలకమని గుర్తు చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలకు, మహిళా, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అందాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం ఎంఎస్ఎంఈ సంఘాలు, పారిశ్రామికరంగ ప్రతినిధులతో చర్చల కోసం సమయం కేటాయిస్తానని భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ ఎక్స్‌పోలో ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. దేశంలో కంప్యూటర్ విప్లవానికి నాంది పలికిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల అన్ని కేటగిరీలపై 100% రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చిందని, కేవలం ఈవీలను వాడటమే కాక వాటి సప్లై చైన్ టెక్నాలజీని ఇక్కడే అభివృద్ధి చేయడమే మన లక్ష్యమని చెప్పారు. 2035 నాటికి తెలంగాణలో 34 గిగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచమంతా మాట్లాడుకుంటున్న 'పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల' విధానాన్ని తెలంగాణ 1970ల నాడే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రయోగాత్మకంగా ప్రారంభించిందని, సాంకేతికతలో తెలంగాణ ఎప్పుడూ ముందే ఉంటుందని గర్వంగా చెప్పారు. గత రెండున్నరేళ్లలో పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్ల నుంచి 18,500 మెగావాట్లకు పెరిగినప్పటికీ రాష్ట్రంలో పవర్ కట్స్ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం ప్రభుత్వ పెట్టుబడులతోపాటు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌ను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పెట్టుబడులు పెట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులతో తెలంగాణ ముఖచిత్రం మారబోతోందని డిప్యూటీ సీఎం చెప్పారు. పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, విద్యార్థులు ఈ ఎక్స్‌పోను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



# రూ.13,006 కోట్లతో మెగా రోడ్ల ప్రాజెక్టు

**మొదటిపేజీ తరువాయి**

వల్ల నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రహదారులను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించేలా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. కనగల్‌లో జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర మౌలిక వసతుల రంగంలో కీలక మార్పులు చోటుచేసుకోవడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు లభిస్తుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

# రాష్ట్రానికి భారీ వర్ష సూచన

**హైదరాబాద్, జూన్ 26:**

లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 27 నుంచి జులై 2వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వర్షంతోపాటు ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40, 50 కిలోటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.



# రైతు ఆశీర్వాద సభ తో హీటెక్కిన రాజకీయాలు

**మొదటిపేజీ తరువాయి**

సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇదే సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు.

**విపక్షాల విమర్శనాస్త్రాలు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ కీలక నేత మాజీ మంత్రి హరీష్ రావు ఒకరి తర్వాత ఒకరు ఉమ్మడి ఖమ్మంలో పర్యటించి రైతు సమస్యలను ప్రస్తావిస్తూ ముగ్గురు మంత్రులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు దారుణంగా అన్యాయం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు 40 రకాల సన్నాలకు బోనస్ అని చెప్పి, ఇప్పుడు కేవలం 7 రకాలకే పరిమితం చేశారని ఆరోపించారు. 'గ్యారెంటీ కార్డుల' పేరుతో ప్రజలకు కుచ్చుటోపీ పెట్టారని, ఏడాదికి ప్రతి కుటుంబానికి రెండున్నర లక్షలు ఇస్తామంటూ బాండ్ పేపర్లపై రాసిచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ కార్డులను ఇప్పుడు ఎక్కడ పెట్టుకోమంటారని ప్రశ్నించారు. రెండేళ్ల క్రితం ఖమ్మం నగరంలో వచ్చిన మున్నేరు వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడడం కోసం హెలికాప్టర్ పంపమని జనం వేడుకున్నా మంత్రులు పట్టించుకోలేదని విరుచుకుపడ్డారు. మంత్రులు తమ ఆస్తులు పెంచుకునే పనిలో ఉన్నారని ఆరోపించారు. భట్టి విక్రమార్క కమీషన్ల కోసం, పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూముల కోసం చూస్తున్నారని, మంత్రి తుమ్మల సత్తుపల్లి బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూముల అమ్మకాల్లో బిజీగా ఉన్నారని ఆరోపించారు. వరుసగా మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టి సుమారు రూ.29 వేల కోట్ల ఇవ్వకుండా రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మధిర సభలో రైతులు ఎందుకు ఆశీర్వదించాలని నిలదీశారు. రైతు క్షమాపణ సభ అని పేరు పెట్టుకోవాలని హరీష్ సూచించారు. నిధులను వరదలా పారించి సీత రామ ప్రాజెక్టును 2026 పంద్రాగస్టు లోగా అందుబాటులోకి తీసుకొస్తామని 2024 ఖమ్మం జిల్లా వైరా సభ, సీతారామ పంప్ హౌస్ ల ప్రారంభం సందర్భంగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని తుంగలో తొక్కారని, 30న చింతకాని మండలంలో నిర్వహించే రైతు, ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతున్న సీఎం సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తారో లేదో స్పష్టతనివ్వాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. జిల్లా పాడి రైతులకు ఆశాదీపంగా, దశాబ్దాలుగా వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న ప్రతిష్టాత్మక విజయా డెయిరీ'మూసివేసేందుకు కుట్ర జరుగుతుందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. డెయిరీ భూములను రియల్ ఎస్టేట్‌కు అప్పగించే పన్నాగం జరుగుతుందని, ఒక మంత్రి తన సొంత డెయిరీని స్థాపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని, ప్రభుత్వ డెయిరీ ఇక్కడే కొనసాగితే తన డెయిరీకి రైతుల నుంచి పాల సేకరణ జరగదని, అమ్మకాలకు గండిపడుతుందన్న దురుద్దేశంతోనే ఈ మూసివేత కుట్రకు తెరలేపారని ఆరోపించారు.

**నాలుగు కోట్ల ప్రజల కోసం పాలన**

బీఆర్ఎస్ నేతల విమర్శలపై కాంగ్రెస్ మంత్రులు ధీటుగా స్పందించారు. బి ఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ కుటుంబంలో కొడుకు, అల్లుడు, కూతురు రాష్ట్రం మీద పడి దోచుకున్నారని, తమకున్న పత్రికలు, సోషల్ మీడియా ద్వారా అబద్ధాలను పదే పదే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పాలనంటే నలుగురి కోసం కాదు.. 4 కోట్ల ప్రజల కోసమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కఅన్నారు. పదిసార్లు అబద్ధం చెబితే అదే నిజమైపోతుందనే భ్రమలో వారు బతుకుతున్నారని, ఇలాంటి నాయకులు రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరం అని కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ విపక్షాల విమర్శలను రైతులు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు,ఓడిపోయిన పార్టీలు ఏవో చెబుతుంటాయని, కానీ కష్టాల్లో కూడా రైతులను ఆదుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు బేరీజు వేసుకొని మద్దతు తెలపాలని ఆయన కోరారు.

**సీఎం సభ కు భారీ ఏర్పాట్లు**

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవరంలోని చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యే ఈ సభకు రెండు లక్షల మంది జన సమీకరణ కోసం భారీ కసరత్తు చేపట్టారు. రైతు భరోసా నిధులను సీఎం చేతుల మీదుగా విడుదల చేయడానికి నిర్వహించనున్న కార్యక్రమమే రైతు ఆశీర్వాద సభ. రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో తొలిసారి జరుపుతున్న బహిరంగ సభ ఇదే. వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో భారీ ఖర్చుతో జర్మన్ షెడ్లు వేస్తున్నారు. 30 సీఎం సభ నేపథ్యంలో మొదటి రెండు రోజులు 28, 29 తేదీల్లో రైతు మేళా నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. రోజు 5000 మంది రైతులను తరలించేందుకు వ్యవసాయ శాఖకు లక్ష్యం విధించారు. మూడో రోజు సీఎం పాల్గొనే బహిరంగ సభకు జిల్లా నుంచే 1.50 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను తరలించేందుకు మూడు వేల బస్సులను ఏర్పాటు చేస్తున్నది. నియోజకవర్గ నుంచి లక్షమంది, మిగతా నియోజకవర్గాల నుంచి మరో 50 వేల మంది తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణం, రెండు హెలిపాడ్లు 30 ఎకరాలు, పార్కింగ్ కోసం 100 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. సభ నిర్వహణకు ప్రభుత్వం దాదాపు రూ 5 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ నెల 30న ఖమ్మంలో జరగనున్న రైతు ఆశీర్వాద సభ రాష్ట్ర రాజకీయాల్లో కీలక ఘట్టంగా మారనుంది. ప్రతిపక్షాలు సంధించిన ప్రశ్నలకు సభ వేదికగా కాంగ్రెస్ పార్టీ ఎలా జవాబిస్తుందో, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి ప్రకటనలు చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

# కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

**హైదరాబాద్, జూన్ 26:**

రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుత సీఎస్ కె.రామకృష్ణారావు పదవీ కాలం జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు సీఎస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ, మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాక గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు. సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ, కేంద్ర సమాచారప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్, వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాక కేంద్ర నిధుల సాధనలోను, కేంద్రరాష్ట్రాల మధ్య పెండింగ్ జల వివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ, పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో రాష్ట్ర బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# ఆగస్టు నాటికి కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ

**మొదటిపేజీ తరువాయి**

స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పామాయిల్ సాగు విస్తరణలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగులో ఉండగా నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే 70 లక్షల ఎకరాల్లో విస్తరణ జరగాలన్నారు. దేశవ్యాప్తంగా 36 శాతం సాగు విస్తరణతో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వంట నూనెల దిగుమతుల కోసం మన దేశం ఏటా రూ.లక్ష కోట్లు ఖర్చు చేసే పరిస్థితులు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం పామాయిల్ ఇంపోర్ట్ టాక్స్ 44 శాతం పెంచాలని,అపుడే దేశీయంగా రైతాంగానికి మద్దతు ధరలు పెరుగుతాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రహ్లాదజోషిలను ఇటీవల కలిసి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ ఫ్రూట్ బంచ్ టన్ను గెలలు ధర రూ.23,852లు ఉందని, కనీస గ్యారంటీ ధర రూ.25 వేలుగా కేంద్రం ప్రకటించాలని కోరినట్లు గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఉండగా సిద్దిపేట జిల్లా నర్మెట్ట లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ రైతులకు అందుబాటులో ఉండగా ఖమ్మం జిల్లాలో కల్లూరు గూడెం(కొణిజర్ల), గద్వాల జిల్లా బీచ్ పల్లి, ములుగు జిల్లా ఇంచర్ల, పెద్దపల్లి, వనపర్తి జిల్లాల్లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టు లో రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చెయ్యాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం రైతు భరోసా, రైతు భీమా పథకం, ఉచిత విద్యుత్ సరఫరాతో పామాయిల్ రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ చేస్తే తెలంగాణలో గ్రీన్ కవర్ పెరగటంతోపాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ముఖ్య భూమిక వహించనున్నదని అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు పామాయిల్ సాగు చేపట్టాలని రైతాంగాన్ని కోరారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.



# తెలంగాణలో అధికారమే బీజేపీ లక్ష్యం

**హైదరాబాద్ జూన్ 26 :**

క్షేత్రస్థాయి నుంచి బీజేపీని మరింత బలోపేతం చేసి రాబోయే రోజుల్లో పార్టీ అధికారం దిశగా నడిపించడమే లక్ష్యంగా జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈనెల 28నుంచి మూడు రోజులపాటు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించనున్నారని వెల్లడించారు. నితిన్ పర్యటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని, పార్టీ అధికారంలోకి వస్తుందనే నమ్మకాన్ని రెట్టింపు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 28న నితిన్ శంషాబాద్ చేరుకుని అక్కడి రంగారెడ్డి జిల్లా కార్యాలయం నుండి పది జిల్లాల పార్టీ నూతన కార్యాలయాలను వర్చువల్ గా ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని బూత్ అధ్యక్షుల భారీ సమావేశంలో పాల్గొంటారని, అనంతరం రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమవుతారని వివరించారు. రెండో రోజు ఉదయం వీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థులతో నిర్వహించే ప్రత్యేక కాన్‌క్లేవ్‌లో పాల్గొంటారు. అనంతరం వరంగల్‌లో లంబాడ, కోయ, చెంచు, గోండు వంటి వివిధ ఆదివాసీ, గిరిజన తెగల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన తర్వాత, ఉమ్మడి వరంగల్ జిల్లా బూత్ ప్రెసిడెంట్స్ సమావేశంలో పాల్గొంటారని వివరించారు. మూడవ రోజు ఘట్‌కేసర్‌లో జరిగే రాష్ట్ర కార్యవర్గ (స్టేట్ వర్కింగ్ కమిటీ), ఆఫీస్ బేరర్స్ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారని, మధ్యాహ్నం ఢిల్లీకి తిరుగు పయనమవుతారని చెప్పారు.

**తుంగభద్ర నీటి వాటాలపై నిజాలు వెల్లడించాలి**

తుంగభద్ర నది గేట్ల మరమ్మతుల వ్యవహారాన్ని బీజేపీ స్వాగతిస్తోందని, అయితే నీటి వాటాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రతిపాదించిన నవేలి రిజర్వాయర్, ఏపీలోని గుండ్రేవుల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు రావాల్సిన 15.9 టీఎంసీల నీటి వాటా దెబ్బతిని 5 టీఎంసీలు మాత్రమే వచ్చే ప్రమాదం కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్గతంగా ఏం మాట్లాడారో, రాష్ట్ర ప్రయోజనాలపై ఎలాంటి హామీలు తెచ్చారో ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. గతంలో కృష్ణా, గోదావరి బేసిన్లలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు.

**కాంగ్రెస్, ఎంఐఎంలవి నాటకాలు**

ఎన్ఆర్సీ, పౌరసత్వ సవరణ చట్టం అంశాలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నాటకాలు ఆడుతున్నాయని రామచందర్‌రావు మండిపడ్డారు. 2013 బాంబే హైకోర్టు తీర్పు ప్రకారం పాస్‌పోర్టు అనేదిలం ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి రుజువు కాదని స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఓటరు నమోదు ప్రక్రియలో ఆధారాల కోసం నిర్దేశించిన 12 రకాల పత్రాలలో పాస్‌పోర్టు కూడా ఒకటి మాత్రమేనన్నారు. బారిస్టర్ అయిన ఒవైసీ ప్రజలను తప్పుదారి పట్టించడం తగదని హితవు పలికారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం భారత పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని, రోహింగ్యాలు, బంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు ఓటు హక్కు కల్పించడం చట్టవిరుద్ధమని అన్నారు. తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో అనవసర భయభ్రాంతులు సృష్టించవద్దని కాంగ్రెస్, ఎంఐఎంలను ఆయన హెచ్చరించారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలి

మొదటిపేజీ తరువాయి

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనిత రామచంద్రన్, సినీ నటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి, అంతర్జాతీయ జిమ్నాస్ట్ అరుణ బుద్ధా రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ విభాగం అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఆరోగ్యవంతమైన యువతే తెలంగాణ భవిష్యత్తు**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు తెలంగాణలో ఎలాంటి స్థానం ఉండదని స్పష్టం చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు చట్టాలు మాత్రమే సరిపోవని, సమాజంలో అవగాహన, బాధ్యత, విలువలు పెరిగినప్పుడే నిజమైన మార్పు వస్తుందన్నారు. విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు అందరూ కలిసి యువతను ప్రభావితం చేయాలని అన్నారు. సినీ హీరో రామ్ పోతినేని, నటి మీనాక్షి చౌదరి యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని, జీవితంలో లక్ష్యాలను సాధించడమే నిజమైన విజయం అని పిలుపునిచ్చారు. క్రీడాకారిణి అరుణ బుద్ధా రెడ్డి కూడా క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారానే యువత ఉన్నత శిఖరాలను చేరుకోగలరని పేర్కొన్నారు.

**ప్రతి యువకుడు డ్రగ్స్‌కు 'నో' చెప్పాలి**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని సమాజం దూరం పెట్టకుండా వారికి సరైన మార్గం చూపాలని, మిత్రుల్లో ఎవరైనా డ్రగ్స్‌కు అలవాటు పడితే వారిని ఆ ప్రమాదం నుంచి బయటపడేలా సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రతి ఒక్కరూ సైనికులుగా మారాలని, యువత సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఆదర్శంగా నిలవాలని సూచించారు.

**డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వ సహకారం**

డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దేశంలోనే అత్యుత్తమ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థగా తీర్చిదిద్దిందని ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ అత్యంత సవాళ్లతో కూడుకున్న బాధ్యత అని అన్నారు. ఈ పోరాటంలో ఈగల్ బృందానికి అవసరమైన ప్రత్యేక వాహనాలు, డ్రగ్ డిటెక్షన్ పరికరాలు, ఆధునిక సాంకేతిక వనరులను తెలంగాణ ప్రభుత్వం అందించిందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ తమకు అండగా నిలుస్తోందని, ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**విజేతలకు బహుమతుల ప్రదానం**

డ్రగ్స్ వ్యతిరేక అవగాహనలో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, ఇతర పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సి.వి. ఆనంద్ తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

## డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టండి

**హైదరాబాద్,జూన్ 26:**

సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

మొదటిపేజీ తరువాయి



నుండి ఇస్లాం మతంలోకి మారిన వారికి వెనుకబడిన తరగతి ముస్లిం కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ హైకోర్టు కొట్టివేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం (వెనుకబడిన తరగతి, అత్యంత వెనుకబడిన తరగతి, డినోటిఫైడ్ కమ్యూనిటీస్, షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు ఇస్లాం మతంలోకి మారినప్పటికీ వారికి బీసీ ముస్లిం కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించవచ్చని పేర్కొంది. అంతేకాక ప్రభుత్వం నోటిఫై చేసిన ఏడు ప్రత్యేక బీసీ ముస్లిం వర్గాలలో ఒకదానికి చెందిన సభ్యులుగా వారిని గుర్తిస్తూ కమ్యూనిటీ సర్టిఫికెట్లు జారీ చేయడానికి కూడా ఈ ఉత్తర్వు అనుమతించింది. తమిళనాడు ప్రభుత్వ భావన చట్టపరంగా, భావనాత్మకంగా పూర్తిగా తప్పని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతి ముస్లిం హోదాను పొందలేరని మేము నిర్ధారిస్తున్నాము.. మతం మారిన వ్యక్తి కేవలం ఒక ముస్లిం మాత్రమే అవుతాడు,. అంతే తప్ప ప్రత్యేక వర్గానికి చెందడు' అని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ప్రత్యేక వెనుకబడిన ముస్లిం వర్గాలలో అన్సార్, దక్కనీ ముస్లింలు, దుబేకుల, లబ్బాయి, మాపిళ్ళ, షేక్, సయ్యద్ ఎవరైనా కొత్తగా మతం మారిన వారిని సభ్యునిగా పరిగణించడం సాధ్యం కాదని, అందువల్ల వారు ఆ వర్గం కింద రిజర్వేషన్లు పొందడానికి అర్హులు కారని కోర్టు తేల్చి చెప్పింది. జూలై 2008లో జారీ చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా తమిళనాడులోని పైన పేర్కొన్న ఏడు ముస్లిం వర్గాలను ప్రత్యేక కేటగిరీలో చేర్చారు. అయితే, ఇతర సామాజిక వర్గాల నుండి ఇస్లాంలోకి మారిన వారికి కూడా ఈ సర్టిఫికెట్లు ఇవ్వాలనే 2024 నాటి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి న్యాయపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

## పీఆర్సీపై సీఎం హామీ అమలు చేయాలి

- **ఆరోగ్య పథకానికి అత్యుత్సాహంతో వేతనాల కోత**
- **2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్**
- **పెండింగ్ లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలి**
- **తరగతికి ఒక గది, ఒక టీచర్ ఉండాలి**
- **బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వాలి**
- **డీటీఎఫ్ రాష్ట్ర శాఖ డిమాండ్**

**హైదరాబాద్, జూన్ 26:**

అనేక వేదికల మీద ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే పీఆర్సీ కమిషన్ నుండి రిపోర్ట్ తెప్పించుకొని అమలుకు చర్యలు చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమయ్య అధ్యక్షతన హైదరాబాద్ లోని డిక్కీ హౌస్ లో శుక్రవారం జరిగింది. సోమయ్య, లింగారెడ్డి లు మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు అయిందని, ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పీఆర్సీ నివేదిక తెప్పించుకొని 1.07.2023 నుండి అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి విధివిధానాలు ఖరారు కాకముందే, పథకం అమలు చేయకుండానే, అధికారులు అత్యుత్సాహంతో ఉద్యోగుల వేతనాల నుండి కోత విధించడం సరికాదన్నారు. ఇప్పటికైనా సమగ్రమైన రీతిలో విధివిధానాలు రూపొందించి ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం పాత పెన్షన్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ అందుకు విరుద్ధంగా హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ లో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేసిన విధంగా తెలంగాణలో కూడా అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, పెన్షనర్ల ఆర్థిక బిల్లులు వెంటనే చెల్లించాలని, అదేవిధంగా పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలు విడుదల చేయాలనీ, సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పర్యవేక్షక పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తికి సంబంధించి అశాస్త్రీయంగా ఉన్న జీవో 25 ను సవరించాలని, ప్రాథమిక స్థాయిలో తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థానంలో, ఉన్నత పాఠశాలలన్నింటినీ సెమీ రెసిడెన్షియల్ గా మార్చి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు.

# హైదరాబాద్‌లో తొలి డేటా సెంటర్ సిటీ

**హైదరాబాద్, జూన్ 26:**

సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హైఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్అండ్‌ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హైస్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీఎస్‌ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్‌ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే

# అసైన్‌మెంట్ భూములు లాక్కుంటున్నారు

మొదటిపేజీ తరువాయి

మరిచిపోవద్దని, తమ భూములు ఇవ్వనందుకే లగచర్ల గిరిజనులపై పోలీసు కేసులు పెట్టించి, దాడులు చేయించి జైలులో పెట్టాడని ఆరోపించారు. గుండెపోటు వస్తే ఆయనకు వైద్యం అందించకుండా బేడీలు వేసి మరీ తిప్పించారన్నారు. పరిగి నియోజకవర్గంలో అడ్డగోలుగా అసైన్డ్ భూములు పేదల నుంచి లాక్కుంటామంటే ఒప్పుకునేదే లేదని హెచ్చరించారు. ఆ పేదలకు బీఆర్ఎస్ అండగా నిలబడుతుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వాటికి పట్టాలు ఇచ్చి పట్టాలకు ఇవ్వాల్సినంత నష్టపరిహారం ఇచ్చి రైతుల అంగీకారంతోని భూములు సేకరించే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ని నమ్మొద్దు.. నమ్మితే మోసపోతాము.. తెలంగాణ ఆగమయిపోతుందని కేసీఆర్ రెండేళ్ల కిందటే స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. పరిగి లాంటి వ్యవసాయ ఆధారిత నియోజకవర్గంలోని రైతన్నలకు రైతుబంధు ఇస్తామని చెప్పి పెన్షన్లు, పంటల బోనస్, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఘోరంగా మోసం చేసిండన్నారు. కేవలం రైతన్నలకే కాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేందుకు 420 హామీలు ఇచ్చి డిక్లరేషన్లు గ్యారెంటీలతో సబ్బండ వర్గాలను మోసం చేసిర్రు అని కేటీఆర్ విమర్శించారు. పరిగి నియోజకవర్గానికి గ్రావిటీతోని కేసీఆర్ నీళ్లు తీసుకొస్తామంటే రేవంత్ రూ.4,400 కోట్లతోని ప్రత్యేకంగా ఒక స్కీమ్ తయారు చేసి కమీషన్ల కోసం లిఫ్ట్ ఇరిగేషన్ పథకమని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తా అన్న రేవంత్ రెడ్డి కనీసం వారికి ఇస్తామన్న రూ.2,500లు ఇస్తే లక్షాధికారులు అవుతారన్నారు. ఒక్కొక్క ఆడబిడ్డకి రూ.లక్షన్నర వారి బ్యాంకు ఖాతాలో వేస్తే శాశ్వతంగా రాజకీయల నుంచి వైదొలుగుతానని సవాలు విసిరారు. పదేపదే కాంగ్రెస్ చేతిలో మోసపోకుండా మనం కలిసి కొట్లాడవలసిన అవసరం ఉన్నదని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. రాబందు పోవాలె☐, రైతుబంధు కేసీఆర్ రావాల అన్న లక్ష్యంతో కలిసి పని చేద్దామన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిబాట పట్టించాలంటే అందరం సమష్టిగా ముందుకు పోవాల్సిన అవసరం ఉన్నదని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పరిగిలోని ప్రతి గ్రామానికి, తండాకి, ఇంటింటికీ కేసీఆర్ నీళ్ళిచ్చారన్నారు. ఈ సందర్భంగా ఎసఐఆర్‌తోపాటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపైన శ్రేణులకు కేటీఆర్ అవగాహన కల్పించారు. పార్టీ కార్యకర్తలపైన అరాచకాలు, అక్రమ కేసులు పెడితే ఆ పోలీస్ అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కార్యకర్తలకు దక్కాల్సిన గౌరవం, పదవుల అంశంలో తాను బాధ్యత తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

**హైదరాబాద్, జూన్ 26 :**

నగరంలో వరదల నివారణ, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా 'హైడ్రా' చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ.107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను సంస్థ కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని జలాశయాలుగానే కాక స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలు ఏర్పాటు చేయనున్నారు. పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలో బోటింగ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలపై కన్నెర్రయాలి

మొదటిపేజీ తరువాయి

పాటించాలన్నారు. గతంలో విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ఆధారంగా కనీస ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై విజయశాంతి స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలను గౌరవించి వాటిని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి విద్యా సంవత్సరానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సద్వినియోగం అయ్యేలా, అర్హులైన విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోని విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో కూడిన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- **సీఎంవో నుంచి అజిత్ రెడ్డి ఔట్**
- **కొత్తగా ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా నియామకం**
- **ముఖ్య కార్యదర్శిగా ఎన్. శ్రీధర్**
- **అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్**

**హైదరాబాద్,జూన్ 26:**

రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ అధికారి ఎన్.శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డికి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సబ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె.చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. కాగా, ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సీఎస్‌గా ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్/ఎక్స్‌ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది.



# వెనిజువెలా విలయం

## చమురు రంగానికి భారీ షాక్

## భారత చమురు దిగుమతులకు బ్రేక్

లాటిన్ అమెరికా దేశమైన వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4,300 మంది తీవ్రంగా గాయపడ్డారని, భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40 వేల మంది జాడ తెలియరాలేదని ఆధికారిక వర్గాలు వెల్లడించడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పర్యావరణ విధ్వంసం కూడా ఈ స్థాయి భూకంపాలకు కారణమై ఉండొచ్చని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన 'లా గువేరా' తీర నగరంలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస (ఖచీ) ప్రతినిధులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు.

### సోషల్ మీడియాపై ఆంక్షలు ఎత్తివేత..

భూకంప విపత్తు నేపథ్యంలో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకునేందుకు వీలుగా సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' (ట్విట్టర్) పునరుద్ధరించబడింది. గత 2024లో నికోలస్ మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే.

### సహాయానికి కదిలిన అంతర్జాతీయ సమాజం

ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకు వస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీనిని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బందిని, వైద్య బృందాలను, మానవతా సాయాన్ని పంపేందుకు సిద్ధమయ్యాయి.

### భారత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం!

ఈ భూకంపాల ప్రభావం భారత్‌పై కూడా ఆర్థికంగా, వాణిజ్యపరంగా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఇటీవలి ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితియోంల్లో భూకంపం వల్ల అక్కడి నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థ స్తంభించడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే, భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్ (ాచీ+జ ఎఱఎవంష్ట్ర)కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో భారీ పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. వెనిజువెలా కోలుకుని, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు భారత వ్యాపారాలకు ఇది పెద్ద దెబ్బగానే భావించాల్సి ఉంటుంది.



# సర్ ప్రక్రియకు పాస్‌పోర్ట్ చెల్లుబాటు

■ ఎన్నికల సంఘం కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, జూన్ 26:** తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో పాస్‌పోర్ట్ పాత్రపై కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఒక ముఖ్యమైన వివరణ ఇచ్చింది. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్న లేదా ప్రస్తుతం వివరాలను సవరించుకోవాలన్నా అవసరమైన 12 రకాల ధృవీకరణ పత్రాలలో పాస్‌పోర్ట్ కూడా ఒకటిగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వివరణ సాధారణ ఓటర్లకు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎంతో ఊరటనిచ్చే అంశం. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 1967 పాస్‌పోర్ట్ చట్టాన్ని ఉటంకిస్తూ, పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణ పత్రమే కానీ, అది పౌరసత్వానికి నిరూపణ కాదని పేర్కొంది. ఈ ప్రకటన సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ పౌరసత్వం విషయంలో సమస్యలు వస్తాయా? ఓటర్ల జాబితాలో పాస్‌పోర్ట్ ఆధారంగా పేరు నమోదు చేయడం సాధ్యం కాదా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమయ్యాయి. దీంతో ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. ఎన్నికల సంఘం అధికారుల ప్రకారం, ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తి పేరు చేర్చడానికి ఆ వ్యక్తి భారతీయ పౌరుడై ఉండటం, నిర్ణీత వయసు కలిగి ఉండటం ప్రాథమిక సూత్రం. దీనిని నిరూపించడానికి ఓటరు నమోదు అధికారి కొన్ని పత్రాలను పరిశీలిస్తారు. ఈ పత్రాల జాబితాలో పాస్‌పోర్ట్ ఎప్పటి నుంచో ఉంది. అది అలాగే కొనసాగుతుంది. "పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి గుర్తింపును, నివాసాన్ని ధృవీకరించే కీలక పత్రం. ఇందులో ఎలాంటి మార్పు లేదు" అని ఒక ఉన్నతాధికారి స్పష్టం చేశారు. గతంలో








బిహార్‌లో జరిగిన SIR, అసోంలో జరిగిన ప్రత్యేక సవరణలు, ఆ తర్వాత జరిగిన వివిధ దశల ఓటర్ల జాబితా సవరణలలో కూడా పాస్‌పోర్ట్‌ను ఒక ప్రామాణిక పత్రంగానే పరిగణించారు. గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి కొత్త విధానాన్ని తీసుకురాలేదని, పాత పద్ధతులే అమల్లో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంటే దశాబ్ద కాలంగా పాస్‌పోర్ట్ అనేది ఓటరుగా నమోదు కావడానికి ఒక నమ్మదగిన ఆధారంగా ఉంటూ వస్తోంది. చట్టపరంగా చూస్తే పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి భారత వెలుపలికి వెళ్లడానికి లేదా తిరిగి రావడానికి ఇచ్చే ప్రయాణ పత్రం. అయితే ఓటర్ల జాబితా తయారీ సమయంలో , సదరు వ్యక్తి వివరాలను సరిచూడటానికి అధికారులు కోరే 12 పత్రాలలో ఇది ఒకటి. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ దరఖాస్తుదారు సమర్పించిన ఈ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటు హక్కుపై నిర్ణయం తీసుకుంటారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసేటప్పుడు పాస్‌పోర్ట్ మాత్రమే కాకుండా, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి మరో 11 పత్రాలను కూడా ప్రభుత్వం అనుమతిస్తుంది. కేంద్ర ప్రభుత్వం కానీ, ఎన్నికల సంఘం కానీ పాస్‌పోర్ట్ ప్రాముఖ్యతను తగ్గించే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఓటరు నమోదు ప్రక్రియలో దరఖాస్తుదారు పత్రాలను అంగీకరించే పూర్తి అధికారం సంబంధిత అధికారులకు ఉంటుంది. పాస్‌పోర్ట్ సమర్పించినప్పుడు దాన్ని నిరాకరించడానికి వీలులేదని తాజా వివరణ ద్వారా స్పష్టమవుతుంది.

# ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి

- ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ



**న్యూఢిల్లీ, జూన్ 26:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన్' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు!



- ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు రాజీనామా !
- ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 26:** సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్‌ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు. రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి. రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు. ఎఫ్‌ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవినాష్ శుక్లా కూడా పాలుపంచుకున్నాడు. కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా కూడా నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో నిందితులుగా పేర్కొన్న వ్యక్తులు చాలావరకు కానుకల లెక్కింపు, నగదు నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉద్యోగులేనని అర్థమవుతోంది. ఇది, వీరు వ్యవస్థలోని కింది స్థాయి వ్యక్తులు మాత్రమేనా, లేక ఈ వ్యవస్థ మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాలు, రక్షణలో పనిచేస్తోందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది.

# వడ్డెర సంఘం సర్వసభ్య సమావేశం - ఐక్యతకు పిలుపు

**ముఖ్య అతిథి గా ఫిట్ల శ్రీధర్ హాజర్**



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** కొండాపూర్ కల్చరల్ క్లబ్‌లో వడ్డెర సంఘం సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పిట్ల శ్రీధర్ మాట్లాడుతూ, వడ్డెర సమాజ ఐక్యత, అభివృద్ధి, యువతకు విద్యా, ఉపాధి అవకాశాల కల్పన, సంఘ బలోపేతం తప్పనిసరి అని అన్నారు. "సమాజ పురోగతి కోసం అందరం ఐక్యంగా కృషి చేయాలి. యువత విద్య, ఉద్యోగాల్లో ముందుకు రావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు, పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథి పిట్ల శ్రీధర్‌ను సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు.

# జర్నలిస్ట్ గండమల్ల ఉపేందర్ అకాల మృతి.. కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

**పాడే మోసిన ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** మండల జర్నలిజం రంగంలో తనదైన ముద్ర వేసిన సీనియర్ పాత్రికేయుడు, టీయూడబ్ల్యూజే (ఐజేయు) తిరుమలాయపాలెం మండల ప్రెస్ క్లబ్ సభ్యుడు గండమల్ల ఉపేందర్ ఇక లేరనే వార్త స్థానిక పాత్రికేయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన మరణంతో గండమల్ల ఉపేందర్ కుటుంబంలో ఒక విషాద ఛాయలు అలముకున్నాయి.

**కన్నీటి వీడ్కోలు పలికిన తోటి జర్నలిస్టులు:**

ఉపేందర్ మరణవార్త తెలియగానే టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ సభ్యులు, మండల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, కన్నీటి నివాళులర్పించారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కూరపాటి విజయకుమార్, గోవింద సురేష్, ప్రచార కార్యదర్శి గుజ్జ రామకృష్ణతో పాటు పాత్రికేయ మిత్రులు ఎలిమల్ల శ్రీనివాస్, కామల్ల వీరయ్య, మేకల నాగరాజు గోవింద సురేష్ ఉబ్బని సుందర్ కొండా ఉపేందర్, ఎడవల్లి నాగరాజు, కూరపాటి ఉపేందర్, మెట్టు రుద్రరాజు ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సుబ్లేడు మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ టిఆర్ఎస్ మండల నాయకులు సందు రాజు ఐసయ్య తదితరులు ఉపేందర్ పార్థివదేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఆయనతో గడిపిన క్షణాలను, వృత్తిపరంగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ తోటి జర్నలిస్టులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎల్లప్పుడూ నవ్వుతూ, అందరితో స్నేహపూర్వకంగా ఉండే ఉపేందర్ అంత చిన్న వయసులోనే దూరమవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

**అనాథలైన భార్యాపిల్లలు:**

ఉపేందర్ మృతితో ఆయన కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడింది. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి ఇక లేడనే విషయాన్ని తెలుసుకుని ఆ పిల్లలు ఏడుస్తున్న తీరు, భర్త భౌతికకాయంపై పడి భార్య రోదిస్తున్న దృశ్యాలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి. ఉపేందర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ఈ పుట్టెడు దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ మండల పాత్రికేయ లోకం తమ సెంటిమెంట్‌ను చాటుకుంది.

# అనాసాగారం చెరువులో పట్టపగలే అక్రమ మట్టి తవ్వకాలు

## నాయకుల అండదండలతో యథేచ్ఛగా దందా.. మౌనం వహిస్తున్న అధికారులు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలం అనాసాగారం గ్రామంలోని చారిత్రక చెరువు అక్రమార్కుల దోపిడీకి గురవుతోంది. పట్టపగలే, నడిరోడ్డుపైనే యంత్రాలతో మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.గ్రామ శివారులో ఉన్న అనాసాగారం చెరువు కట్ట, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ప్రాంతం నుంచి గత కొన్ని రోజులుగా అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. స్థానికంగా కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని గ్రామస్తులు బహిరంగంగానే చెబుతున్నారు. పగటిపూటే జేసీబీలు, ట్రాక్టర్లతో మట్టిని తవ్వి, మండల పరిధిలోని పొలాలను చదును చేసేందుకు తరలిస్తున్నారు. మేము ఫోన్ చేసి చెప్పినా 'చూస్తాంలే' అని దాటవేస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం" అని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తతంగంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.అనాసాగారం చెరువుపై ఆధారపడి వందలాది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇష్టానుసారంగా చెరువులో మట్టిని తవ్వడంతో పాటు ఎఫ్‌టీఎల్‌ను పూడ్చివేస్తుండటంతో చెరువు విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతోందని మత్స్య కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."మట్టి తవ్వకాలతో చెరువులో పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. దీనివల్ల వర్షాకాలంలో నీరు సమానంగా నిల్వ ఉండదు. గోతుల్లోకి చేరిన నీరు వృథాగా ఇంకిపోతుంది. చేప పిల్లలు వదిలినా బతికే పరిస్థితి ఉండదు. మా బతుకులు రోడ్డున పడతాయి" అని మత్స్యకార సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు లోతు పెరగడంతో పాటు గట్టు దెబ్బతిని భవిష్యత్తులో గ్రామానికి ముంపు ముప్పు కూడా పొంచి ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు. నిబంధనల ప్రకారం చెరువులు, కుంటల నుంచి మట్టి తవ్వాలంటే ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతి తప్పనిసరి. అయితే ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు సాగిస్తున్నారు. చెరువు కట్టను ధ్వంసం చేయడంతో భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి అనాసాగారం చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. చెరువును పరిరక్షించి, ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# ఏడాదికొకసారి జరుపుకొనే సంబురం పీర్ల పండుగ...

- పీర్ల పండుగ అంటేనే ఇంటింటి పండుగ.....
- మాసాని గూడ గ్రామ సర్పంచ్ అర్చన ప్రభుగౌడ్



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** సంవత్సరానికి ఒకసారి అందరూ కలిసి అన్నదమ్ము ల్లా జరుపుకునే పండగే పీర్ల పండుగని మాసాని గూడ గ్రామ సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్ అన్నారు. శుక్రవారం రోజు వారు గ్రామంలోని గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన పీర్ల పండుగ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో సంతోషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణలో పీర్ల పండుగ అంటే ఇంటింటి పండుగేనని, కుల మతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు కలిసి అన్నదమ్ముల్లా ఏడాదికి ఒకసారి జరుపుకునే సంబు రమే పీర్ల పండుగని అన్నారు. పది రోజులపాటు పీర్లను పెత్తెటోళ్లంతా నిష్ఠతో ఉపవాసాలు ఉండడం జరుగుతుందన్నారు. సాంబ్రాణి అగర్బత్తులతో కమ్మని వాసనను గ్రామంలో వ్యాపిస్తూ... ఇంటికో పేరు.. కులానికో సవారిని నిలబెడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# బోథ్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రారంభం



**రాజముద్ర న్యూస్, బోథ్:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మండల కాంగ్రెస్ కన్వీనర్ మేరుగు భోజన్న అన్నారు. మండల కేంద్రంలోని 259వ పోలింగ్ స్టేషన్లో శుక్రవారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని బీఎల్ఓలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడడమే ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో పేరు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, ఉప సర్పంచ్ విజయ రాజా రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ దాస్, సూపర్వైజర్ మహమ్మద్, బీఎల్ఓ సగ్గం శాంత, మాజీ ఎంపీటీసీ ఉమేష్, షేక్ అబుద్, అచ్యుతానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో ఇంటింటి ఓటరు సర్వే ప్రారంభం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఇంటింటి ఓటరు సర్వేను గ్రామ సర్పంచ్ ఆకుల వేంకటేశం ప్రారంభించారు. గ్రామంలోని 136, 137 పోలింగ్ బూత్ల పరిధిలో బీఎల్ఓలు ప్రమీళ, రజిత, బీఎల్ఏ డేగ స్వామి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు–చేర్పులకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తూ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ బీఎల్ఓలు, బీఎల్ఏలకు పూర్తి సహకారం అందించి సరైన సమాచారాన్ని అందించాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, జాబితాలోని లోపాలను సరిదిద్దేందుకు ఈ ప్రత్యేక సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు

**జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు**



**రాజముద్ర న్యూస్, జైనూర్:** అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో గల గణేష్నగర్, ముమ్మీన్పూర్ ప్రాంతాల్లోని 72, 73 పోలింగ్ బూత్లలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ఓటరు సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఆ హక్కు అందేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ముఖీద్, మండల నాయకులు, మాజీ ఎంపీటీసీ షేక్ రషీద్, జిల్లా నాయకులు పెందూర్ ప్రకాష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అఫ్సన్ అఫ్రోజ్, మాజీ ఉప సర్పంచ్ అబు, యూత్ నాయకుడు హైదర్, మైనార్టీ సెల్ నాయకుడు వసీం, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాగజ్నగర్ మండలంలో భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** కాగజ్నగర్ మండలంలోని కోయవాగు చింతగూడ గ్రామంలో మొహరం పండుగ వేడుకలను శుక్రవారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొహరం పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు సమర్పించారు. అలాగే గ్రామంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు. మొహరం వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా సాగగా, గ్రామ ప్రజలు మతసామరస్యాన్ని చాటుతూ ఐక్యంగా పండుగను నిర్వహించారు. వేడుకల్లో మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## కేయూ క్యాంపస్ డ్రైవ్లో 45 మందికి ఉద్యోగాలు

- నియామక పత్రాలు అందజేసిన ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ చిర్ర రాజు గౌడ్




**రాజముద్ర న్యూస్, వరంగల్:** కాకతీయ యూనివర్సిటీ ప్లేస్మెంట్ డైరెక్టర్ చిర్ర రాజుగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్లో ప్రముఖ ఔషధ తయారీ సంస్థ హెట్రో 45 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసింది. వివిధ విభాగాలకు చెందిన 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూల అనంతరం 45 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, కంపెనీ ప్రతినిధులతో కలిసి చిర్ర రాజు గౌడ్ వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దడమే కేయూ ప్లేస్మెంట్ సెల్ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా వరుసగా క్యాంపస్ నియామక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే శనివారం రీజనెన్స్ విద్యాసంస్థల్లో 60 మంది కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ జూనియర్ లెక్చరర్ల నియామకానికి సంబంధించి కేయూ మ్యాథమెటిక్స్ విభాగం సెమినార్ హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హెట్రో హెచ్ఆర్ వేణు మాధవ్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధులు రాకేష్, నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల పై అవగాహనకు ఐ.ఎఫ్.హెచ్.ఈ వినూత్న కార్యక్రమం

**రాజముద్ర న్యూస్, ఉమ్మడి రంగారెడ్డి:** విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన పెంపొందించి, వ్యసనరహితమైన ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఐఎఫ్హెచ్ఈ హైదరాబాద్లో "నిరామయ తరంగం" మాదకద్రవ్యాల నిరోధక విభాగం పరిచయ కార్యక్రమం, బాధ్యతల స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో "పవిత్రత యొక్క అల – స్వేచ్ఛతో కూడిన జీవితం" అనే నినాదంతో రూపొందిన "నిరామయ తరంగం" లక్ష్యాలను వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతను పెంపొందించడం, ప్రతి విద్యార్థిలో నైతిక విలువలను బలోపేతం చేయడం ఈ విభాగం ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్హెచ్ఈ హైదరాబాద్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కోటి రెడ్డి, భవిష్యత్ నగర పోలీసు విభాగం పరిధిలోని మోకిలా పోలీసు స్టేషన్ సిఐ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు సురేష్ గౌడ్, పద్మ, ఐబీఎస్ హైదరాబాద్ సంచాలకులు ప్రొఫెసర్ ఎస్. వేణుగోపాల్ రావు, సంయుక్త రిజిస్ట్రార్ వి. మధుసూదన్ రావు, విద్యార్థి కార్యకలాపాల సమన్వయకర్త ప్రొఫెసర్ మాధవి గరికపర్తి, అదనపు రిజిస్ట్రార్ సమద్ నూరుస్ తదితరులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సభలో మాట్లాడిన ఎస్. శ్రీనివాస్ రెడ్డి మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తి, కుటుంబం, సమాజం ఎదుర్కొనే తీవ్రమైన దుష్పరిణామాలను వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి విద్యార్థి చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సానుకూల మార్పుకు యువతే మార్గదర్శకులని ఆయన పేర్కొన్నారు. ప్రసంగించిన ప్రముఖులు మాదకద్రవ్యాల నిర్మూలనలో అవగాహన, నివారణ చర్యలు, విద్యార్థుల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యత, క్రమశిక్షణ, నిజాయితీ, మానవతా విలువలను పాటిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా బాధ్యతల స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించి, కొత్తగా నియమితులైన సభ్యులకు అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. అనంతరం వారు మాదకద్రవ్యాల నిర్మూలనకు అంకితభావంతో కృషి చేస్తామని, విద్యార్థుల్లో నిరంతరం అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన, సురక్షితమైన విద్యా ప్రాంగణాన్ని నిర్మించేందుకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రత్యేక నాటికను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు పలు విద్యార్థి సంఘాలు సహకారం అందించగా, కార్యక్రమాన్ని మరో విద్యార్థి బృందం దృశ్యరూపంలో నమోదు చేసింది. కొత్తగా నియమితులైన సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించగా, నిర్వహణ సంఘ సభ్యులు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు.


# యువ నాయకులే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్

- గ్రామస్థాయి నుంచే నాయకత్వాన్ని తీర్చిదిద్దాలి
- బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలి.. ఒక్క ఓటు కూడా కోల్పోకూడదు
- మహిళలకు యువజన కాంగ్రెస్లో సముచిత స్థానం కల్పిస్తాం



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** యువ నాయకులను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయి నుంచి యువ నాయకులను గుర్తించి వారికి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చైతన్యంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు.యువజన కాంగ్రెస్ కమిటీలను గ్రామ, వార్డు స్థాయి వరకు విస్తరించాలని, చురుకుగా పనిచేసే యువతకు సంస్థాగత బాధ్యతలు అప్పగించాలని సూచించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, ప్రతి బూత్లో బీఎల్ఏలు చురుకుగా పనిచేసి ఒక్క అర్హత గల ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటరు జాబితాపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహిళలకు యువజన కాంగ్రెస్లో మరింత ప్రాధాన్యం కల్పించాలని, ప్రతి కమిటీలో వారికి సముచిత స్థానం ఇవ్వాలని అన్నారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతానికి యువత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్లో పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు వచ్చేలా తాను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన స్టేట్ జనరల్ సెక్రెటరీ వేలిమినేటి సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ ఆలీ, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేది లక్షాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, సునీల్ రెడ్డి, తన్వీర్ హుస్సేన్, సైదులు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, బాలు గౌడ్, అబ్దుల్ రహీం, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి,చింతమళ్ళ రమేష్, వీరన్న నాయక్, గడ్డం వెంకన్న,రుద్రంగి రవి, బండారు వెంకన్న, ఏడ్ల వీరమల్లు,గుణగంటి సతీష్, కోడి శివ,నిమ్మల లవన్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పడిదల రవి, యువజన పట్టణ అధ్యక్షుడు బొడ్డు సాయి,జోహార్, శ్రావ్య రెడ్డి, విజయభాస్కర్, మాధవరెడ్డి, నవీన్ చారి, హజిమ్ నరేష్, జావిద్,వినయ్,సుదీర్,లక్ష్మణ్, శివ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం




- మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ
- సూర్యాపేటలో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దేశంలో ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు సూర్యాపేటలో ఉన్న హోటల్ శ్రీ గ్రాండ్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూర్యాపేటలో ఫౌండేషన్ కోచింగ్ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలలో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు'. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ 'అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ–జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు'.

## చెన్నారం గ్రామంలో అంగరంగ వైభవంగా మొహరం పండుగ

**పీర్లతో ఊరేగింపు, ఆకట్టుకున్న వేషాలు.. భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి:నేలకొండపల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో మొహరం పండుగను గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. హిందూ, ముస్లిం భేదం లేకుండా గ్రామ ప్రజలంతా కలిసిమెలిసి పీర్ల పండుగలో పాల్గొని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.మొహరం మాసం సందర్భంగా గ్రామంలోని పీర్ల చావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అలంకరించిన పీర్లతో గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, బ్యాండ్ మేళాల నడుమ యువకులు "యా హుస్సేన్, యా అలీ" అంటూ నినాదాలు చేస్తూ పీర్లను ఊరేగించారు. మహిళలు, చిన్నారులు పీర్లకు దండం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.పండుగలో భాగంగా యువకులు వేషాలు వేసి అందరినీ అలరించారు. ప్రత్యేకంగా వేషగాళ్ల విన్యాసాలు గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డప్పు చప్పుళ్లకు అనుగుణంగా వేసిన నృత్యాలు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశాయి. చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ వేషధారణలతో ఉత్సాహంగా పాల్గొన్నారు."మా గ్రామంలో మొహరం పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకుంటాం. పీర్ల పండుగ అంటే మాకు గ్రామ పండుగే. అందరం కలిసి చేస్తాం అని గ్రామ పెద్దలు తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుండి పీర్లకు బియ్యం, బెల్లం, నైవేద్యాలు సమర్పించారు. రాత్రి పీర్ల చావిడి వద్ద ఫాతెహా కార్యక్రమం నిర్వహించి, అన్నదానం చేశారు.చెన్నారం గ్రామంలో తరతరాలుగా వస్తున్న ఈ ఆనవాయితీని భావితరాలకు అందించాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. మొహరం పండుగ మత సామరస్యానికి, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ముజావర్ ఎస్కే మదర్ తెలిపారు పేర్కొన్నారు.

## ఓటరు జాబితాలో పేరు నమోదు ప్రధాన లక్ష్యం

**రాజముద్ర న్యూస్, సిరికొండ:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదవడం ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి అన్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శుక్రవారం సిరికొండ గ్రామంలోని 158వ పోలింగ్ కేంద్రం పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ మౌనజ, ఆర్ఐ రాజేశ్వర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాల నమోదు విధానాన్ని పరిశీలించి, సర్వే పురోగతిపై ఆరా తీశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ కొత్తగా అర్హత సాధించిన ఓటర్ల పేర్లను నమోదు చేయడంతో పాటు, జాబితాలోని తప్పులను సరిదిద్దడం, అనర్హుల పేర్లను తొలగించడం వంటి ప్రక్రియలను అధికారులు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.



# ఐర్లాండ్‌తో తొలి టీ20కు సిద్ధమైన టీమిండియా

## నెట్స్‌లో మెరిసిన వైభవ్ సూర్యవంశీలిలి

**బెల్‌ఫాస్ట్, జూన్ 26 :** ఐర్లాండ్‌తో ఇవాళ జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌కు టీమిండియా సిద్ధమైంది. బెల్‌ఫాస్ట్ వేదికగా జరుగనున్న ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌కు ముందు 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ నెట్స్‌లో చేసిన ప్రాక్టీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తుది జట్టులో అతనికి అవకాశం దక్కుతుందా లేదా అన్నది ఇంకా స్పష్టత రాకపోయినా, తొలిసారి టీమిండియా సీనియర్ ఆటగాళ్లతో కలిసి అతను తీవ్రంగా సాధన చేశాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో అగ్రశ్రేణి బౌలర్లపై దూకుడుగా ఆడిన వైభవ్, అదే ఆత్మవిశ్వాసంతో నెట్స్‌లోనూ భారీ షాట్లు కొట్టాడు. బౌలర్లను భయపడకుండా ఎదుర్కొంటూ వివిధ షాట్లతో ఆకట్టుకున్నాడు. ఈ ప్రాక్టీస్ వీడియోను బీసీసీఐ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేయగా, ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యువ ఓపెనర్ ప్రదర్శన టీమిండియా బ్యాటింగ్ లైనప్‌కు కొత్త ఉత్సాహం తెచ్చేలా కనిపిస్తోంది.

# లీగ్ దశలో ఒక్క గోల్ ఇవ్వలే..


## ఆరో జట్టుగా మెక్సికో రికార్డు..!

ఆద్యంతం వేడుకలా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో మెక్సికో(వీవఇఅఎశీ) చరిత్ర సృష్టించింది. లీగ్ దశలో మూడుకు మూడు మ్యాచుల్లో విజయాలతో నాకౌట్‌కు వెళ్లిన ఆతిథ్య జట్టు.. ప్రత్యర్థిని ఒక్కగోల్ కూడా కొట్టనివ్వలే. తద్వారా.. లీగ్ దశలో శత్రు జట్టుకు ఒక్క గోల్ సమర్పించుకోని జట్టుగా రికార్డు పుస్తకాల్లో నిలిచింది. మొత్తంగా సాకర్ వరల్డ్‌కప్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించిన ఆరో జట్టుగా మెక్సికో గుర్తింపు తెచ్చుకుంది. ఈసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో రికార్డులు బద్దలవుతున్నాయి. లీగ్ దశ 33వ మ్యాచ్‌లోనే వంద గోల్స్ నమోదవ్వడం ఓ రికార్డైతే.. ఆతిథ్య మెక్సికో ప్రత్యర్థికి ఒక్క గోల్ ఇవ్వకుండానే నాకౌట్ చేరింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో చిత్తు చేసి.. హ్యాట్రిక్ విజయాలతో ఔరా అనిపించిన మెక్సికో వరల్డ్‌కప్ చరిత్రలో అరుదైన ఫీట్ సొంతం చేసుకుంది. ఇదివరకూ నెదర్లాండ్స్(1974), బ్రెజిల్(1986), ఇటలీ(1990), అర్జెంటీనా(1998), ఉరుగ్వే(2018).. ఈ ఐదు జట్లు మాత్రమే లీగ్ దశలో ప్రత్యర్థిని ఒక్క గోల్ కొట్టనివ్వలేదు. గ్రూప్ ఏలోని మెక్సికో తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 0-2తో ఓడించింది. రెండో గేమ్‌లో దక్షిణ కొరియాను





వణికిస్తూ 1-0 విజయం సాధించింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో ఓడించిన మెక్సికో నాకౌట్ బెర్తు పట్టేసింది. మూడు విజయాలు.. ఆరు పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది మెక్సికో. 32వ రౌండ్ తొలి మ్యాచ్‌లో మంగళవారం ఎస్తాడియో అజ్టెకాను ఎడ్సన్ అవ్వరెజ్ సారథ్యంలోని మెక్సికో ఢీకొట్టనుంది.



# ఐరిష్ బోర్డు నిర్వాకంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆగ్రహం

**బెల్ఫాస్ట్, జూన్ 26 :** భారత్, ఐర్లాండ్ మధ్య జరగనున్న రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం బెల్ఫాస్ట్ చేరుకున్న టీమిండియాకు తొలి రోజే అసౌకర్యకర పరిస్థితి ఎదురైంది. ప్రాక్టీస్ కోసం కేటాయించిన మైదానంలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ సమయంలో అవసరమైన సైట్ స్క్రీన్ లేకపోవడం వల్ల సెషన్‌కు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. టీ20 క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌కు బంతి స్పష్టంగా కనిపించేందుకు సైట్ స్క్రీన్ అత్యంత కీలకం. ఈ అంశాన్ని గుర్తించిన భారత సపోర్ట్ స్టాఫ్ వెంటనే ఐర్లాండ్ క్రికెట్ బోర్డుకు సమాచారం ఇచ్చింది. అనంతరం ఐరిష్ అధికారులు స్పందించి తక్షణమే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇదే సిరీస్‌తో 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. నెట్స్ సెషన్‌లో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ వంటి బౌలర్లను ఎదుర్కొని అతను ఆకట్టుకున్నట్లు సమాచారం. అయితే తుది జట్టులో వైభవ్‌కు అవకాశం దక్కే విషయంపై ఇంకా స్పష్టత లేదు. జట్టులో ఇప్పటికే ఓపెనింగ్ స్థానాలకు తీవ్ర పోటీ ఉండటంతో మేనేజ్‌మెంట్ తుది నిర్ణయం మ్యాచ్‌కు ముందు తీసుకునే అవకాశం ఉంది.

# వైభవ్ సూర్యవంశీపై ప్రపంచ దృష్టి..

## అశ్విన్ కీలక సూచన



**బెల్ఫాస్ట్, జూన్ 26 :** భారత క్రికెట్‌లో కొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల దృష్టి కేంద్రీకృతమైంది. భారత జట్టులో ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించిన ఈ యువ ఆటగాడు, రాబోయే ఐర్లాండ్ మరియు ఇంగ్లాండ్ సిరీస్‌ల నేపథ్యంలో ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారాడు. ఈ నేపథ్యంలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వైభవ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్న వయసులోనే అతనిపై భారీ అంచనాలు పెరగడం సహజమని, అయితే ఆ ఒత్తిడిని పక్కన పెట్టి తన సహజ ఆటను ఆస్వాదించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడేటప్పుడు వచ్చే ఒత్తిడిని తగ్గించుకుని, తాను చిన్నప్పుడు వీధుల్లో క్రికెట్ ఆడినట్లే స్వేచ్ఛగా ఆడాలని అశ్విన్ అభిప్రాయపడ్డారు. వైభవ్ ఇటీవల ఇండియా ఏ జట్టు తరపున శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయాన్ని అశ్విన్ ప్రశంసించారు. ఫైనల్ మ్యాచ్‌లో అతను జట్టు విజయానికి కీలకంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడినట్లు గుర్తుచేశారు. అతని బ్యాటింగ్‌లో ఉన్న దూకుడుతో పాటు పరిస్థితులకు తగ్గట్టుగా ఆడగల సామర్థ్యం అతన్ని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని తెలిపారు. మొత్తానికి వైభవ్ సూర్యవంశీపై ఉన్న అంచనాలు భారీగా ఉన్నప్పటికీ, అతని సహజ ఆటే అతని పెద్ద బలం అవుతుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 452 పరుగులకు డిక్లేర్

## శతకాలతో తుక్కు రేపిన జురెల్, సాయి సుదర్శన్..



ఇండియా 'ఎ' వర్సెస్ శ్రీలంక 'ఎ' మధ్య శ్రీలంకలోని గాలే వేదికగా జరుగుతున్న మొదటి అనధికారిక టెస్ట్ మ్యాచ్ రెండవ రోజు ఆట ముగిసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా 'ఎ' జట్టు, సాయి సుదర్శన్ మరియు కెప్టెన్ ధ్రువ్ జురెల్ ల అద్భుత శతకాల సాయంతో తన మొదటి ఇన్నింగ్స్‌ను 111.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 452 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మొదటి రోజు ఓపెనర్ సాయి సుదర్శన్ 19 ఫోర్లతో 132 పరుగులు చేసి జట్టుకు మంచి పునాది వేయగా, దేవదత్ పడిక్కల్ (12), రుతురాజ్ గైక్వాడ్ (22) నిరాశపరిచారు. అయితే.. మ్యాచ్ కు వర్షం అంతరాయం కల్పించినా.. కెప్టెన్ ధ్రువ్ జురెల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి 215 బంతుల్లో 141 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతనికి తోడుగా షేక్ రషీద్ 63 పరుగులు చేసి రెండో రోజు ప్రారంభంలోనే అవుట్ అయినప్పటికీ, వీరిద్దరూ ఐదో వికెట్‌కు 116 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ సిరీస్‌కు ముందు భారత్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన ట్రై-సిరీస్‌ను గెలుచుకున్న ఉత్సాహంతో ఇండియా 'ఎ' బరిలోకి దిగింది. ఆ ట్రై-సిరీస్ ఫైనల్లో 29 బంతుల్లో 94 పరుగులు చేసి భారత్‌కు విజయాన్ని అందించిన వైభవ్ సూర్యవంశీ, ప్రస్తుతం సీనియర్ జట్టుతో కలిసి ఐర్లాండ్ పర్యటనలో (టీ20 అరంగేట్రం చేసే అవకాశం) ఉన్నందున ఈ టెస్ట్ సిరీస్‌కు అందుబాటులో లేడు. ఈ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం భారతదేశంలో అందుబాటులో లేదు. భారత జట్టులో సాయి సుదర్శన్, ఆయుష్ పాండే, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, ధ్రువ్ జురెల్ (కెప్టెన్), షేక్ రషీద్, హర్ష్ దూబే, సారాంశ్ జైన్, అన్షుల్ కంబోజ్, యష్ ఠాకూర్, ఆకిబ్ నబీ దార్ ఉన్నారు. శ్రీలంక జట్టులో పవంత వీరసింఘే, నిరోషన్ డిక్వెల్లా, నువనిందు ఫెర్నాండో, అషెన్ బండార, సహన్ అరాచ్చిగే (కెప్టెన్), రవిందు ఫెర్నాండో, అంజలా బండార, కవిందు పతిరత్నే, దులజ్ సముదిత, చామిక గుణశేఖర, దిలుమ్ సుదీర ఆడుతున్నారు.

# క్రికెట్ దిగ్గజాలకు గౌరవ హోదాలు

## దేశ సేవలోనూ ప్రత్యేక గుర్తింపు

**న్యూఢిల్లీ, జూన్ 26 :** మైదానంలో ప్రత్యర్థులను చిత్తు చేసి భారత క్రికెట్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన పలువురు దిగ్గజ ఆటగాళ్లు, దేశ సేవలోనూ తమదైన ముద్ర వేశారు. బ్యాట్, బాల్‌తో కోట్లాది అభిమానులను సంపాదించిన ఈ స్టార్ క్రికెటర్లకు భారత సైన్యం, పోలీస్ శాఖలు గౌరవ హోదాలు ప్రదానం చేసి గౌరవించింది. క్రమశిక్షణ, దేశభక్తి, సమాజ సేవకు గుర్తింపుగా ఈ హోదాలను అందుకున్న వీరు, క్రీడలతో పాటు సేవా రంగంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదా లభించింది. ధోనీ తన విధుల్లో భాగంగా సైనికులతో కలిసి శిక్షణలో పాల్గొనడం ప్రత్యేకతగా నిలిచింది. 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్‌కు కూడా భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ ర్యాంక్ అందించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ గౌరవ హోదాను ప్రదానం చేసింది.

ఇక భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు తెలంగాణ పోలీస్ శాఖ డీఎస్పీ గౌరవ హోదా ఇచ్చింది. అలాగే మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పంజాబ్ పోలీస్‌లో డీఎస్పీ హోదాలు లభించాయి. క్రీడల్లో విశేష సేవలందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వాలు, రక్షణ దళాలు, పోలీస్ శాఖలు ఇలాంటి గౌరవ హోదాలు ప్రదానం చేస్తుంటాయి. మైదానంలో విజయాలతో దేశానికి కీర్తి తీసుకురావడమే కాకుండా, దేశ సేవకు ప్రతీకలైన గౌరవ హోదాలను అందుకోవడం ద్వారా ఈ క్రికెటర్లు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆటలో క్రమశిక్షణ, జీవితంలో దేశభక్తి కలిసినప్పుడు ఎంతటి గౌరవం దక్కుతుందో ఈ దిగ్గజాల ప్రయాణం మరోసారి చాటి చెబుతోంది.






# అమెరికాతో థ్రిల్లర్..

## ఆఖరి నిమిషంలో నెగ్గిన టర్కీ

**లాస్ ఏంజిల్స్:** ఫిఫా వరల్డ్‌కప్ లో టర్కీ తొలి విజయాన్ని నమోదు చేసింది. వాస్తవానికి టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిన ఆ జట్టు .. లాస్ ఏంజిల్స్ స్టేడియంలో హోస్ట్ అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో నెగ్గింది. గ్రూప్ డీ మ్యాచ్‌లో మొత్తం అయిదు గోల్స్ నమోదు అయ్యాయి. ఈ మ్యాచ్‌లో అమెరికా ఓడినా.. ఆ గ్రూపులో మాత్రం ఆ దేశమే అగ్రస్థానంలో ఉన్నది. ఆట ప్రారంభమైన మూడు నిమిషాలకే అమెరికా ప్లేయర్ ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టాడు. డీప్ కార్నర్ నుంచి సెబాస్టియన్ అందించిన పాస్‌ను లెఫ్ట్ ఫూట్‌తో ట్రస్టీ గోల్‌గా మలిచాడు. టోర్నీ నుంచి ఎలిమినేట్ అయినా.. అమెరికాతో మ్యాచ్‌లో మాత్రం టర్కీ పట్టుదలతో ఆడింది. ఇక టర్కీ ప్లేయర్ గులేర్ 10వ నిమిషంలో ఆ జట్టుకు తొలి గోల్ అందించాడు. అరగంట ఆట ముగిశాక.. టర్కీ ప్లేయర్ బారిస్ యిల్మాజ్ మరో గోల్ చేశాడు. దీంతో టర్కీ లీడింగ్‌లోకి వెళ్లింది. రెండో హాఫ్ 49వ నిమిషంలో అమెరికా ప్లేయర్ బెర్‌హాల్టర్ గోల్ చేసి ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేపాడు. దాదాపు ఆట ముగిసే సమయం వరకు రెండు జట్లు 2-2 గోల్స్ తేడాతో సమంగా పోరాడాయి. కానీ 98వ నిమిషంలో టర్కీ ప్లేయర్ అందర్నీ స్టన్ చేశాడు. కాన్ అయాన్ గోల్ చేయడంతో కీలకమైన మూడు పాయింట్లు టర్కీ ఖాతాలోకి వెళ్లాయి. అమెరికా జట్టు ఈ టోర్నీలో చరిత్ర సృష్టిస్తోంది. ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ ఈవెంట్‌లో ఇప్పటికే 8 గోల్స్ చేసింది. గతంలో 1930, 2002లో అత్యధికంగా ఏడు గోల్స్ మాత్రమే చేసింది.



## హిట్ కోసం ఎదురుచూస్తున్న కేతిక శర్మ

టాలీవుడ్‌లో యువ నటి కేతిక శర్మ ఇప్పటికీ తన తొలి భారీ విజయాన్ని కోసం ఎదురుచూస్తున్నారు. రొమాంటిక్ సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, మొదటి చిత్రంతోనే గ్లామర్ గర్ల్‌గా గుర్తింపు సంపాదించినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. ఆకాష్ పూరి సరసన నటించిన తొలి సినిమా ప్రేక్షకుల్లో గుర్తింపు తీసుకువచ్చినప్పటికీ వసూళ్ల పరంగా పెద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత నాగశౌర్యతో నటించిన 'లక్ష్య' కూడా ఆమెకు నిరాశనే మిగిల్చింది. వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగా' సినిమా కూడా డిజాస్టర్‌గా నిలవడంతో వరుసగా అవకాశాలు ఆశించినంతగా రాలేదు. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'బ్రో' చిత్రంపై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఆ సినిమా కూడా కేతిక కెరీర్‌కు పెద్ద ఊతం ఇవ్వలేకపోయింది. దీంతో ప్రస్తుతం ఆమెకు పెద్దగా సినిమా అవకాశాలు తగ్గినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం కేతిక శర్మ చాలా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తన క్రేజ్‌ను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే మంచి స్క్రిప్ట్‌తో మళ్లీ వెండితెరపై బలమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలనే ఆశతో ఆమె ఎదురుచూస్తున్నారు.



## ప్రస్తుతం రిలేషన్‌షిప్‌లో లేను

**శృతి హాసన్ క్లారిటీ..**

సినీ నటి శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె ప్రేమ వ్యవహారంపై వస్తున్న ప్రచారాలకు తాజాగా ఆమె స్వయంగా స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం ఎవరితోనైనా ప్రేమ సంబంధంలో ఉన్నారా అని ప్రశ్నించగా, తాను ప్రస్తుతం ఎవరితోనూ ఎలాంటి ప్రేమ సంబంధంలో లేనని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా ప్రచారంలో ఉన్న వార్తలకు తెరపడింది. మరో అభిమాని నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని ప్రశ్నించగా, చిన్నారుల మానసిక వైద్యురాలిగా మారాలని తనకు ఆసక్తి ఉండేదని శృతి తెలిపారు. ఆమె ఇచ్చిన ఈ సమాధానం కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో వరుస విజయాలతో గుర్తింపు తెచ్చుకున్న శృతి హాసన్ ప్రస్తుతం సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తక్కువ చిత్రాలు చేస్తున్నప్పటికీ అభిమానులతో మాత్రం సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం మమేకమవుతున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించిన శృతి హాసన్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే ఆమె నటించనున్న 'సలార్--2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు స్వయంగా సమాధానం ఇవ్వడంతో శృతి హాసన్ వ్యాఖ్యలు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.




## నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు

**సునీత మరోసారి స్పష్టీకరణ..**

గాయని సునీత ఇటీవల చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీయగా, వాటిపై మరోసారి ఆమె స్పందిస్తూ తన ఉద్దేశాన్ని వివరించారు. 'నా శరీరం.. నా హక్కు' అనే అంశంపై తాను చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. మహిళల హక్కులను తాను ఎప్పుడూ గౌరవిస్తానని, మహిళలపై జరిగే అన్యాయాలకు ఎప్పటికీ మద్దతు ఇవ్వనని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సునీత, మహిళలకు తమకు నచ్చిన దుస్తులు ధరించే పూర్తి హక్కు ఉన్నప్పటికీ, సమాజంలోని వాస్తవ పరిస్థితులను కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో గాయని చిన్మయి శ్రీపాద స్పందిస్తూ, సునీత పట్ల తనకు గౌరవం ఉన్నప్పటికీ, అలాంటి వ్యాఖ్యలు మహిళల హక్కులకు వ్యతిరేకంగా అర్థమయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళల శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కు పూర్తిగా వారిదేనని ఆమె పేర్కొన్నారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన సునీత, చిన్మయిపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. 'నా శరీరం.. నా ఇష్టం' అనే భావన అర్థం తనకు పూర్తిగా తెలుసని, ప్రతి వ్యక్తికీ తన శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కు ఉంటుందని చెప్పారు. అయితే తాను చెప్పదలచుకున్నది సమాజంలో ఇప్పటికీ ఉన్న వాస్తవ పరిస్థితుల గురించేనని, మహిళలపై వేధింపులు లేదా అన్యాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించనని స్పష్టం చేశారు. ఎవరైనా మహిళల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే వారికి వ్యతిరేకంగా నిలబడే వారిలో తాను కూడా ఉంటానని పేర్కొన్నారు. ఫెమినిజం గురించి కూడా సునీత తన అభిప్రాయాలను వెల్లడించారు. మహిళలు, పురుషులు పరస్పరం గౌరవించుకోవడం, అవకాశాల్లో సమానత్వం ఉండటమే తన దృష్టిలో ఫెమినిజం అని తెలిపారు. మహిళలను తక్కువగా చూడడం, వారి అభిప్రాయాలను నిర్లక్ష్యం చేయడాన్ని తాను వ్యతిరేకిస్తానని చెప్పారు. సమానత్వం అంటే అందరూ ఒకేలా ఉండడం కాదని, భిన్న లక్షణాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, సమాన అవకాశాలు ఉండాలన్నదే తన అభిప్రాయమని వివరించారు. మహిళల హక్కులు, సమానత్వం వంటి అంశాలపై గతంలోనూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన సునీత, చిన్మయి వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.






## దసరాకు 'జైలర్ 2'..

సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' చిత్రంపై సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. 'జైలర్' ఘన విజయానంతరం దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌తో మరోసారి రజినీకాంత్ జతకట్టడంతో ఈ సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా, రజినీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన తొలి, రెండో పోస్టర్లు ఇప్పటికే అభిమానులను ఆకట్టుకున్నాయి. మరోవైపు 'జైలర్ 2' విడుదల తేదీపై కూడా సినీ పరిశ్రమలో చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న దసరా సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు యోచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రానికి కూడా సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూరుస్తున్నారు. తొలి భాగానికి ఆయన అందించిన నేపథ్య సంగీతం విశేష ఆదరణ పొందిన నేపథ్యంలో సీక్వెల్‌లోనూ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. మొదటి భాగంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించిన సంగతి తెలిసిందే. అదే తరహాలో 'జైలర్ 2'లో కూడా పలువురు ప్రముఖ నటులు అతిథి పాత్రల్లో కనిపించే అవకాశముందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలతో రూపొందుతున్న ఈ సీక్వెల్ మరోసారి ప్రేక్షకులను అలరిస్తుందనే అంచనాలు ఉన్నాయి. విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అక్టోబర్ 16 విడుదల వార్త ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com